క్లుప్తంగా

శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో బలరామ జయంతి

సీటీఆర్ఐ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో శ్రీ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహారాజ్ ఆధ్వర్యంలో బలరామ జయంతిని శనివారం గోపూజతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస బ్రహ్మాచారి మాట్లాడుతూ పదో తేదీన భగవద్గీత పోటీలు, 13న సాయంత్రం భరత నాట్య ప్రదర్శన, 14న సాయంత్రం భగవద్గీత పోటీ విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం సాయంత్రం 5 గంటల నుంచి హరి నామ సంకీర్తనం, ఉట్టి కొట్టడం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, గురుపూజ, ప్రవచనం, రాత్రి 11 గంటలకు బాలగోపాలునికి 108 కలశాలతో పంచామృతాభిషేకం, 108 దీపాలతో మహా హారతి, గోదావరి మాతకు హారతి, 56 రకాల రాజభోగ నివేదన, తీర్థ ప్రసాద వితరణ, 17న శ్రీనందోత్సవం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో గోకుల్ టీవీఎస్ అధినేత ఎస్‌వీవీ సత్యనారాయణ, పీవీఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో, కబడ్డీ జట్ల ఎంపిక

ప్రకాశంనగర్: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది క్రీడా అంశాల పోటీలు, ఎంపిక విధానంలో మొదటి రోజు శనివారం స్థానిక ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో ఖోఖో, కబడ్డీ జట్ల పోటీలు, ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడాల్లోను రాణించాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి త్రిమూర్తులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి స్వామి, వ్యాయామ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

గౌతమి జీవకారుణ్య సంఘంలో రక్షబంధన్

ప్రకాశం నగర్: రక్షబంధన్ సందర్భంగా శనివారం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ రెడ్‌క్రాస్ వలంటీర్లు స్థానిక గోదావరి బండ్ వద్ద ఉన్న గౌతమి జీవకారుణ్య సంఘం అనాథాశ్రమంలోని విద్యార్థులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది బాలలకు రాఖీ కడుతున్నారని, ఈ కార్యక్రమం ప్రతి ఏడాది కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో తారకేశ్వరరావు, బి.విమల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహేష్ బాబు పుట్టిన రోజు వేడుకలు

ప్రకాశంనగర్: మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టైసన్ ఆధ్వర్యంలో హీరో మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలను శనివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివ, చందు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


బాపనమ్మతల్లిని దర్శించుకున్న ఏఎస్పీ



జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనపర్తి: రామవరం బాపనమ్మ తల్లిని తూర్పుగోదావరి జిల్లా అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా విచ్చేసిన ఆయనను ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభం స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, సబ్బెళ్ల సూర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు అడుగులకు మించి వినాయక విగ్రహాలు పెట్టొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రవిచంద్ర కుమార్

బిక్కవోలు: ఐదు అడుగులకు మించి వినాయక విగ్రహాలు పెట్టవద్దని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. శనివారం తొస్సిపూడి గ్రామంలో వినాయకుడు ఆలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి పురస్కరించుకుని ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు నిర్వహించాలన్నారు. గతంలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి గొడవలు పెట్టుకోవద్దని, పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలోని గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణ వేడుక.. ఖరీదైన వేదిక..!

- శ్రావణ మాసంలో జోరుగా సాగుతున్న పెళ్లిళ్లు
- మధ్య తరగతి ప్రజలకు తప్పని ధరాఘాతం

రాజమహేంద్రవరం రూరల్: శ్రావణ మాసం శుభ కార్యాలకు పెట్టింది పేరు. నెలంతా ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్ల సందడి మొదలైంది. జంటలు ఒక్కటయ్యేందుకు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా పల్లె, పట్టణం తేడా లేకుండా పెళ్లిళ్ల హడావుడి కనిపిస్తోంది. ఊరూరా భాజాభజంత్రీలు మోగుతున్నాయి. పెరిగిన ఖర్చులతో మధ్యతరగతికి భారంగా మారింది. శ్రావణ మాసం ఈ నెల ఆగస్టు 23తో ముగియనుంది. ఈ నెలలో ఇప్పటి ఉన్న ముహూర్తాలతో పాటు రానున్న 10, 11, 13, 14, 15, 17, 18 తేదీల్లో ముహూర్తాలు ముమ్మరంగా ఉన్నాయి. ముఖ్యంగా 13, 14 తేదీల్లో అత్యధికంగా పెళ్లిళ్లు జరగనున్నాయి. దాంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. నగర వ్యాప్తంగా వివాహాలకు సంబంధించి కొనుగోళ్లతో వస్త్ర, బంగారు దుకాణాలలో రద్దీ పెరిగింది. ముహూర్తాలు మొదలు కావడంతో డెకరేషన్, ఫొటోగ్రఫీ, ఈవెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకులు తీరిక లేకుండా ఉన్నారు.



పెళ్లి వేడుకకు సిద్ధం చేసిన కల్యాణ మండపం

పెరిగిన ఖర్చులు

గతంలో వివాహ వేడుకలంటే బ్యాండ్ మేళాలు, భాజాభజంత్రీలు, పూలమండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాలా సాధారణంగా ఉండేవి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు, ప్రీవెడ్డింగ్ షూట్లకు ప్రకృతి సోయగాలతో పేరున్న ప్రాంతాలకు వెళ్తున్నారు. కాబోయే వధూవరులతో ప్రత్యేక పాటల రూపకల్పన చేస్తున్నారు. కల్యాణ మంటపంలో ఎల్ఈడీ స్క్రీన్లను ప్రదర్శించడం వంటికి చేస్తున్నారు. సంపన్నులైతే పెళ్లిళ్ల కోసం రూ.లక్షలు ఖర్చుచేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన వారు, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారు ఖర్చుకు వెనుకాడడం లేదు. అయితే అదే సమయంలో మధ్యతరగతి వర్గాల వారు పెళ్లిళ్ల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు.

రూ.30 వేల నుంచి రూ.రెండున్నర లక్షల వరకు..

వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండడంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. మినీ ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాళ్లు, నగర, పరిసర ప్రాంతాల్లో మొత్తంగా 60కు పైగా ఉండగా, వీటితో పాటు ఆలయాల్లో ఉన్న హాల్స్ కూడా బుక్ అయిపోతున్నాయి. ఫంక్షన్ హాళ్ల బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. మినీఫంక్షన్‌హాల్ అయితే అద్దె రూ.30వేల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుంది. ఇవి కాకుండా పూల డెకరేషన్, లైటింగ్, భోజనాల ఖర్చు వంటి వాటితో కలిపి ప్రస్తుతం మినీ ఫంక్షన్ హాల్ రూ.2.50 లక్షలకు పైగా ఉంటోంది. పెద్ద కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాల్స్‌కు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

33వ రోజుకు చేరిన సత్యసాయి ప్రాజెక్టు కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్ల అమలు కోసం శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు కార్మికులు చేస్తున్న సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీను, ఇస్సాక్‌లు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 20 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, 26 నెలలుగా కట్టాల్సిన పీఎఫ్, ఈఎస్ఐల సొమ్మును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు పస్తులతో ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కార్మికులు కోరుతున్నారు.

నిష్కల్మషమైన జీవితాలకు సాక్ష్యాలు ఆదివాసీలు

- జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
- ఆకట్టుకున్న ఆదివాసీ సంప్రదాయ నృత్య ప్రదర్శన

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రకృతిని నమ్ముకుని జీవించే నిష్కల్మష హృదయాలు కలిగిన వారు ఆదివాసీయులని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని ఇన్‌చార్జి జిల్లా ట్రైబుల్ అధికారి బి.శశాంక అధ్యక్షత వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కొమరం భీమ్, బిర్సా ముండ, ఏకలవ్యుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకృతిని కాపాడుతున్న అడవి బిడ్డలకు శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి జీవన పద్ధతులు, పరస్పర సహకారం, ప్రాచీన చరిత్రకు, సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే జీవన శైలి ఆదివాసుల సొంతమన్నారు. ఆదివాసీలు నేటికీ అనేక రంగాల్లో వెనకబాటులోనే ఉన్నారని, విద్య ద్వారానే నాగరిక సమాజంలో కలిసి తమ హక్కులను ఉనికిని కాపాడుకోగలుగుతారన్నారు. చిన్ననాటి నుంచే గిరిపుత్రులు తగిన లక్ష్యాలను నిర్దేశించుకొని, అందుకు తగ్గ సాధన, శ్రమ ద్వారా వాటిని చేరాలని ఆయన ఆకాంక్షించారు. అప్పుడే మీ నుంచి ఐఏఎస్‌లు, ఐపీఎస్ లు, డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు పుట్టుకొస్తారని పేర్కొన్నారు. శ్రమ విషయంలో దృష్టి పెట్టాలన్నారు. తద్వారా పారిశ్రామికంగాను రాణిస్తారన్నారు. అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ గిరిజనులు తమ హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆదివాసీ దినోత్సవంలో భాగంగా 20 మంది ఆదివాసీలను ఘనంగా దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖా జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు వైజంక్షన్ వద్ద గల కలెక్టర్ బంగ్లా వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, జేసీ చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న జేసీ చిన్న రాముడు తదితరులు

వైఎస్సార్ సీపీ కృషితోనే స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షన్‌లో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు ర్యాంక్ రావడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తాము చేపట్టిన కార్యక్రమాలే కారణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తితో కలసి వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో పారిశుధ్యం ఎంత అధ్వానంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదని, చివరి ర్యాంక్ వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదని అన్నారు. గోదావరిని పరిశుభ్రం చేసేందుకు మిషన్ గంగలో భాగంగా రూ.88 కోట్లు తీసుకొస్తే, ఆ నిధులను ఇప్పటికీ ఉపయోగించడం చేతకావడం లేదని విమర్శించారు. ఎస్‌టీపీ నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. కాంట్రాక్టరు కమిషన్లు ఇవ్వనందు వల్లనే ఈ పని ముందుకు కదలడం లేదని ఆరోపించారు. అఖండ గోదావరి ప్రాజెక్టులో రూ.100 కోట్లు వచ్చినా అందులో రూ.34 కోట్లు మాత్రమే హేవలాక్ బ్రిడ్జికి ఖర్చు చేస్తారని, అందులోనూ 18 శాతం జీఎస్టీకి పోతుందని చెప్పారు. వాస్తవానికి హేవలాక్ వంతెన ప్రాజెక్ట్ పూర్తి చేయాలంటే కనీసం రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్లు అవసరమని చెప్పారు. ఇసుక యథేచ్ఛగా తవ్వేస్తున్నారని, ప్రతి ర్యాంపులో 20 డ్రెడ్జింగ్ బోట్లు ఉంటున్నాయని, కనీసం కేసు కూడా పెట్టడం లేదని అన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు పని చేయడం లేదని, అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర రద్దీ పెరగడంతో వైద్యం అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఎన్ని ఇబ్బందులు పెట్టినా కార్మిక పక్షాన పోరాటం చేస్తా

- కార్మికుల తరపు మాట్లాడితే వైఎస్సార్ సీపీ తొత్తునని అంటావా..!
- ఎన్నికల్లో ఆదిరెడ్డి వాసు నుంచి ఎంత సొమ్ము తీసుకోన్నావో తెలుసు
- గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఎన్ని ఇబ్బందులు పెట్టినా కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం చేస్తానని గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 500 రోజులకు పైగా అయ్యిందని ఇప్పటికీ కార్మికులకు ఒరిగిందిమే లేదన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు కానీ ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. టీడీపీకి చెందిన కొంత మంది శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ విలువలు లేని మాటలు మాట్లాడారన్నారు. తాను అంగవైకల్యంతో ఉన్నా సరే ప్రతి రోజు కార్మికుల సమస్యల గురించి ఆలోచిస్తానని, వాటి కోసం పోరాడే నేనెక్కడా..? డబ్బులు కోసం సంవత్సరానికి కోకసారి కార్మికుల తరుపున మాట్లాడే నివెక్కడా అని నీలదీశారు. 2024 ఎన్నికలలో ఆదిరెడ్డి వాసు వద్దకు వెళ్లి కార్మికుల పేరుతో డబ్బులు దండుకున్న టీఎన్‌టీయూసీ నాయకుడినని చెప్పుకొనే యాళ్ల శ్రీనివాస్ ఈ రోజు ఈ విధంగా మాట్లాడడం వింతగా ఉందన్నారు. తాను కార్మికుల సమస్యల కోసం, వాటి పరిష్కారం కోసం మాట్లాడుతుంటే నన్ను వైఎస్సార్ సీపీ తొత్తునని అవనడం చాలా వింతగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని చెప్పి చేయలేదని దమ్మంటే కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేలా పోరాటం చేయాలని సవాల్ విసిరారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల కోసం శ్రామిక భవనాని తీసుకొచ్చింది ఎవరో చెప్పాలన్నారు. ఇప్పటీ వరకు వైఎస్సార్ సీపీ హయాంలో వేసిన పిల్లర్లు తప్ప ఇంకా కొత్తగా ఏ నిర్మాణాలు జరిగాయే చెప్పాలన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్ బుజ్జి ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కొండపల్లి నాగేశ్వరావు, యూనియన్ ఆర్గనైజర్ సీమాల వీరభద్రరావు, కమిటీ మెంబర్ నెమ్మలపూడి రవి వర్మ, జెనిపే పూర్ణచంద్రరావు, పోలిపల్లి విజయకుమార్ విజయ భాస్కర్, ఎలక్ట్రికల్ వర్కర్స్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జ రామకృష్ణ తదితరులు

అనాథ వృద్ధునికి స్వర్ణాంధ్రలో ఆశ్రయం

రాజమహేంద్రవరం సిటీ: ఇరవై ఏళ్ల క్రితం ఊరు వదిలి వెళ్లిపోయి అనాథగా తిరిగి వచ్చిన మనిబాబుకు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం శనివారం ఆశ్రయమిచ్చింది. వివరాల్లోకి వెళితే విశాఖపట్నం కృప మార్కెట్లో బంగారం పని చేసే గన్నవరపు మనిబాబు అలియాస్ బ్రహ్మం కుటుంబ కలహాలతో ఊరు విడిచి వెళ్లిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగి అమ్మమ్మ ఊరైన కోరుకొండ మండలం బొల్లెద్దుల పాలెం గ్రామానికి చేరుకున్నాడు. 65 ఏళ్ల వృద్ధాప్యంలో తిరిగి బుల్లెద్దులపాలెం రావడంతో అతని దీనస్థితి చూసి తెలిసినవారు ఆశ్రయం కోసమై స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబుని వేడుకున్నారు. వివిధ కారణాల వల్ల కుటుంబ సభ్యుల నిరాదరణతో కుటుంబ సమస్యల వల్ల రోడ్డున పడిన వారిని స్వర్ణాంధ్ర సేవా సంస్థ చారదీసి ఆదరిస్తుందని మనిబాబుకి స్వర్ణాంధ్రలో ఆశ్రయం కల్పిస్తున్నట్టు రాంబాబు తెలిపారు. కొమోజు సతీష్ కుమార్ గన్నవరపు శేషారత్నం అండరం సుశీల మధుబాబుని స్వర్ణాంధ్రలో చేర్పించడంతోపాటు బాధ్యులుగా ఉంటామని హామీ పత్రం రాసిచ్చినట్లు నిర్వాహకులు రాంబాబు తెలిపారు.



వృద్ధుడికి ఆశ్రయం కల్పించిన స్వర్ణాంధ్ర సేవా సంస్థ

ప్రతి నియోజకవర్గంలో ఎస్టీ కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలి

- మానుపాటి రామకృష్ణ
- ఘనంగా ఆదివాసీ గిరిజన దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వం ఎస్టీ కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగా రూరల్ మండలం బొమ్మూరులో కలెక్టరేట్ వద్ద నూతనంగా నిర్మించనున్న జిల్లా గిరిజన భవన్ వద్ద ఏపీ ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా మానుపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో గిరిజనులతో కర్ర సాము, కత్తి సాము విన్యాసాలు, సాంప్రదాయ గిరిజన నృత్యాలు, పోరాట ప్రదర్శనలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదివాసీల సభలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనుల, ఆదివాసీల జనాభా పెరిగిందని, అయితే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల శాతాన్ని 6 నుంచి 10కి పెంచాలని విజ్ఞప్తి చేశారు. మైదాన ప్రాంత గిరిజన యువతకు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని, మైదాన ప్రాంతాల్లో ఐటీడీఏ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గిరిజన భవన నిర్మాణానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించాలన్నారు. గిరిజన హాస్టల్లో వసతి సౌకర్యాలు మెరుగుపరచాలని, రాయితీల ద్వారా వ్యాపార అవకాశాలను ప్రోత్సహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివాసీల స్ఫూర్తి ప్రదాత ఏకలవ్య జన్మదినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అమల దాసు శ్రీనివాసు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీలతో పోల్చితే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. మైదాన ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న వివక్షతపై జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఎస్టీ కుల సంఘాల నాయకులు కుంభ రాంబాబు, భారతి మాచరయ్య, మానుపాటి వెంకటేశ్వరరావు, వేలుబడి వెంకటేశ్వరరావు, మానుపాటి నాగమణి, కాట శ్రీనివాసు, భారతి నాగేశ్వరరావు, సమ్మటం పాపారావు, సింగం బాబ్జి మానుపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ దినోత్సవంలో నృత్య ప్రదర్శన

డీఏ బకాయిలు మంజూరు చేయండి



భాస్కరరావు

రాజానగరం: పదవీ విరమణ చేసి, పెన్షన్లతో కాలం గడుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేసి, తమను ఆదుకోవాలని ఏపీఈపీడీసీఎల్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరుతోంది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధి వై.భాస్కరరావు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి రాసిన విజ్ఞప్తి పత్రాలను శనివారం ఇక్కడ మీడియాకు అందజేశారు. 2004-05 సంవత్సరాలలో నాలుగు డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరు మాసాలకు ఒకసారి డీఏలు విడుదల చేసి, నెల వాయిదాలుగా బకాయిలు చెల్లించేవారన్నారు. గత రెండు సంవత్సరాలలో బకాయి ఉన్న నాలుగు డీఏల విషయమై యూనియన్ పరంగా అడిగినప్పుడల్లా ఉన్నతాధికారుల నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. రిటైర్డ్ అయి పెన్షను సొమ్ములతో జీవించే తమ లాంటి బడుగు జీవులను ఈ విధంగా బాధించడం సరికాదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు డీఏలు ఎంత ముఖ్యమో ఒక కానిస్టేబుల్ కుమారుడిగా ఉపముఖ్యమంత్రికి అవగాహన ఉందని భావిస్తున్నామన్నారు. గతంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, పెన్షనర్స్ పీఆర్‌సీ బోర్డులో సభ్యులుగా ఉండేవారని, నాలుగు సంవత్సరాలకు ఒక పీఆర్‌సీ, ఆరు నెలలకు ఒక డీఏ ఇచ్చేవారని గుర్తు చేశారు. తిరిగి ఆ విధానాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలు

చాగల్లు: స్థానికంగా రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏపీ టార్గెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్.సురేష్ కుమార్ అన్నారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు శనివారంతో ముగిశాయి. ఇందులో విజేతలకు బహుమతులను సురేష్ కుమార్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పోటీలు నిర్వహించడానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలను ఏపీ టార్గెట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జె.విజయలక్ష్మి వెల్లడించారు. బాలికల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా ప్రథమ, పశ్చిమగోదావరి జిల్లా జట్టు ద్వితీయ, విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. అదేవిధంగా బాలుర విభాగంలో విశాఖ జిల్లా జట్టు ప్రథమ, తూర్పుగోదావరి జిల్లా ద్వితీయ స్థానం, నంద్యాల జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో బెస్ట్ షూటర్‌గా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అభిరామ్, బెస్ట్ డైమండ్‌గా వైజాగ్‌కు చెందిన భాస్కర్, బాలికల విభాగంలో బెస్ట్ షూటర్లుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆర్.నవ్య, డి.మౌనిక, బెస్ట్ డైమండ్‌గా టి.అనూష నిలిచారు. అలాగే మిక్స్ టార్గెట్ బాల్‌లో వైజాగ్ జిల్లా ప్రథమ, తూర్పుగోదావరి జిల్లా జట్టు ద్వితీయ, శ్రీకాకుళం జిల్లా జట్టు తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.వాసవి, ఆర్‌వీ ప్రసాద్, ఎండీ నఫీజ్, కొవ్వూరు జోన్ వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టార్గెట్ బాల్ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

ధర్మకర్తల మండలి పదవికి దరఖాస్తు చేసుకోండి

రాజానగరం: పురాతన చరిత్ర కలిగిన స్థానిక రాజా కాండ్రేగుల జోగిజగన్నాథరావు బహుధూర్ పంతులు అన్నదాన సత్రానికి పాలక మండలికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఎగ్జిక్యూటివ్ అధికారి డి.సురేష్‌బాబు తెలిపారు. రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ, కమిషనర్ ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు శనివారం ఈ ప్రకటనను విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు 20 రోజుల్లో తమ దరఖాస్తులను జిల్లా దేవదాయ శాఖాధికారి కార్యాలయానికి పంపించాలన్నారు. ఇతర వివరాలకు 9440326258కి ఫోన్ చేయవచ్చన్నారు.

ఘనంగా విఖనస ముని జయంతి

పెదపూడి: సంపర గ్రామంలో వైఖానస ఆగమ సష్టికర్త విఖనస ముని జయంతిని శ్రావణ పౌర్ణమి శనివారం ఘనంగా నిర్వహించారు. పండితుడు ఖండవల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఆ మునికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతాచార్యులు మాట్లాడుతూ తిరుపతిలో ప్రతి రోజు జరిగే పూజా కార్యక్రమాలన్నీ వైఖానస ఆగమం ప్రకారమే జరుగుతాయన్నారు. విఖనస ముని ఆలయ పూజ, అర్చన విధానాలు ఏవిధంగా చేయాలో గ్రంథం ద్వారా తెలిపారు. కార్యక్రమంలో పండితులు శ్రీనివాసాచార్యులు, సత్యకృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యులు, వంశీకృష్ణ, రామకృష్ణ తదితరులు విశేష పూజలు చేశారు.

సినిమాలు



శ్యామల	:	బకాసుర రెస్టారెంట్
సూర్యమినీ	:	మహావతార్ నరసింహ,
సూర్యప్యాలెస్	:	అతడు
స్వామి	:	హరిహర వీరమల్లు
అనుశ్రీ	:	సు ఫ్రమ్ సో
శివజ్యోతి	:	సార్ మేడమ్
రాజా	:	కింగ్‌డమ్
ఊర్వశి	:	మహావతార్ నరసింహ
మేనక	:	రాజుగాని సవాల్
రంభ	:	జూనియర్
అప్సర	:	కింగ్‌డమ్
అశోక	:	కింగ్‌డమ్
నామవరం వీఎస్ మహల్	:	మహావతార్ నరసింహ
ధవళేశ్వరం మురళీకృష్ణ	:	మహావతార్ నరసింహ
కడియం వెంకటసూర్య	:	మహావతార్ నరసింహ